www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 14 జులై 2024 5 ఏలూరు

ఆగ్రో పరిశ్రమలు పెట్టి వడ్డీ రాయితీ పొందండి : ఎంపి

ఏలూరు సిటీ :రానున్న కాలంలో ఇథనాల్ బ్యాంకర్ కార్డులే హవా అని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో శనివారం జిల్లా రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సేకరించిన ధాన్యానికి సకాలంలో రైతులకు సొమ్ము చెల్లించాలన్నారు. ఇథనాల్ పరిశ్రమలు నెలకొల్పాలని, ఇథనాల్ కలపకుండా పెట్రోలు అమ్మకానికి వీలులేదన్నారు. పరిశ్రమలు స్థాపించటానికి ముందుకు వచ్చేవారికి పది శాతం పెట్టుబడితో 90 శాతం బ్యాంకు రుణాలు మంజూరు చేయిస్తానని, 50 శాతం వడ్డీ రాయితీ ఇప్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. తీసుకున్న రుణం 15 ఏళ్లలో తిరిగి చెల్లించవచ్చన్నారు. పెట్టుబడి మీద రాయితీతో పాటు తయారైన ఇథనాల్‌ను పూర్తి భరోసాతో కొనుగోలు చేస్తామన్నారు. ఒక కెపిడిఎల్‌కు ఒక కోటి పెట్టుబడి, వంద కెపిడిఎల్‌కు పది ఎకరాల స్థలం కావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌విఎస్.ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పైడిపాటి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వర్షం జోరు.. జనం బేజారు..!

'పశ్చిమ'లో 41.3, ఏలూరు జిల్లాలో 21.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

వర్షాలతో ఖరీఫ్ నారుమడులు, నాట్లపై ప్రభావం-ఆందోళనలో రైతులు

ఎగువన భారీ వర్షాలతో గోదావరికి వరదపోటు

'పోలవరం' ఎగువ కాపర్ డ్యామ్ వద్ద 27 మీటర్లు దాటిన నీటిమట్టం

దిగువకు లక్ష క్యూసెక్కుల నీరు విడుదల

బుట్టాయగూడెం మండలంలో కాజ్‌వేపై ప్రవహిస్తున్న నీరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గడిచిన 24 గంటలుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షంతో రెండు జిల్లాల ప్రజానీకం బెంబేలెత్తుతోంది. శనివారం ఉదయానికి 'పశ్చిమ'లో 41.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదవ్వగా ఉండి మండలంలో 67.2, యలమంచిలిలో 64.6 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. ఏలూరు జిల్లాలో 21.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొయ్యలగూడెంలో 54.6, వేలేరుపాడులో 46 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వర్షం కురుస్తుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 80 శాతానికిపైగా నారుమడులు పూర్తవ్వగా, నాట్లు సైతం ముమ్మరంగా వేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో నారుమడులు, నాటిన నాట్లు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. మరో రెండు రోజులు ఇలాగే వర్షం కురిస్తే ముంపు సమస్య తప్పదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే నారుమడి, నాట్లు, దుక్కు వంటి ఖర్చుల కింద ఎకరాకు రూ.పది వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. ఈ దశలో నారుమడులుగాని, నాట్లుగాని దెబ్బతింటే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడనుంది. నారుమడులు ముంపునకు గురైతే నారు సమస్య ఏర్పడుతుందని రైతులు కలత చెందుతున్నారు. మరోపక్క ఎగువ రాష్ట్రం మహారాష్ట్రలో భారీగా వర్షాలు కురుస్తుండటంతో గోదావరికి వరద నీరు పెద్దఎత్తున చేరుతోంది. శనివారం సాయంత్రం ఆరు గంటలకు ఎగువ కాపర్ డ్యామ్ వద్ద 27.180 మీటర్లకు నీటిమట్టం చేరింది. దీంతో దాదాపు లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎగువ కాపర్ డ్యామ్ వద్ద 30 మీటర్లకు నీటిమట్టం చేరితే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో రహదారులపైకి వరదనీరు చేరనుంది. దీంతో దాదాపు 20కుపైగా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడనుంది. కొయిదా, గొమ్ముగూడెం వంటి గ్రామాలను వరద నీరు చుట్టుముట్టే పరిస్థితి రానుంది. దీంతో విలీన మండలాల్లోని గ్రామాలకు వరద ఇబ్బందులు తలెత్తే ప్రమాదం పొంచి ఉంది. గడిచిన రెండేళ్లుగా వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు తీవ్రంగా సతమతమవుతున్నారు. పునరావాస శిబిరాల్లో, కొండలు, గుట్టలపై నెలలు తరబడి తలదాచుకుంటున్నారు. గతానుభవాలను గుర్తు చేసుకుని గోదావరి వరద పేరు చెబితే అక్కడి ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. అదే సమయంలో ఈ మండలాల్లో పంటలు వేయాలంటే రైతులు జంకుతున్నారు. వరదొస్తే పంటలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని, తీవ్రంగా నష్టపోతామనే ఆందోళనలో రైతులు ఉన్నారు. జులై, ఆగస్టు నెలలు గడిచేవరకూ వరద భయం పొంచి ఉండటంతో అక్కడి జనంలో హైటెన్షన్ కొనసాగుతోంది.

జిల్లా ఎస్‌పిగా ప్రతాప్‌శివకిషోర్

మేరీ ప్రశాంతి బదిలీ

ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా ఎస్‌పి కొమ్మి ప్రతాప్ శివకిషోర్ నియమితులయ్యారు. శనివారం ప్రభుత్వం పెద్దఎత్తున ఐపిఎస్‌ల బదిలీ చేపట్టింది. దీనిలో భాగంగా ప్రస్తుత ఎస్‌పి మేరీ ప్రశాంతిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. ఆమె స్థానంలో నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రాంతానికి చెందిన కొమ్మి ప్రతాప్ శివకిషోర్ నియమితులయ్యారు. ఆయన తండ్రి నారాయణ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తుండగా తల్లి ఉదయ ప్రశాంతి గృహిణి. ప్రతాప్‌శివకిషోర్ అక్కడే ప్రాథమిక విద్య అభ్యసించారు. తొమ్మిదో తరగతి నుంచి జవహార నవోదయ విద్యాలయంలో చదివారు. ఖరగ్‌పూర్ ఐఐటిలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. అనంతరం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీలో సీనియర్ డేటా సైంటిస్ట్‌గా ఉద్యోగం సంపాదించారు. 2016, 2017 సంవత్సరాల్లో వరుసగా సివిల్స్ రాశారు. రెండు పర్యాయాలు విజయం సాధించకపోవడంతో మూడోసారి మరింత పట్టుదలతో 2018లో సివిల్స్ రాసి ఉత్తీర్ణత సాధించారు. 2019 బ్యాచ్ ఐపిఎస్‌గా విధుల్లో చేరారు. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలో చింతపల్లి సబ్‌డివిజన్ ఎఎస్‌పిగా పని చేస్తున్నారు. ప్రతిష్టాత్మకమైన ప్రైమ్‌మినిస్టర్ సిల్వర్ కప్‌కు ఆయన 2022లో ఎంపికయ్యారు. ఇక్కడి నుంచి బదిలీ అయిన ఎస్‌పి మేరీప్రశాంతిని డిజిపి కార్యాలయంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

జిపిఎస్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

ఒపిఎస్ అమలు కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఆందోళన

ప్రతులను దహనం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుతూ పాత తేదీతో జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం దుర్మార్గమని, తక్షణం ఆ నోటిఫికేషన్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి డిమాండ్ చేశారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయం వద్ద శనివారం సాయంత్రం జిపిఎస్ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ 2023 అక్టోబర్ నుంచి సిపిఎస్ ఉద్యోగులందరినీ జిపిఎస్‌లోకి తెస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇప్పుడు విడుదల చేయడం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగించడమేనన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ రాజపత్రాన్ని తక్షణమే రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానం పునరుద్దరణకు చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షులు ముస్తఫా ఆలీ డిమాండ్ చేశారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ని తక్షణం అమలు చేసి 2003 డిఎస్‌సి ద్వారా నియమితులైన ద్వారా ఉపాధ్యాయులందరినీ ఒపిఎస్‌లోకి తీసుకోవాలని రాష్ట్ర కార్యదర్శి సుభాషిణి కోరారు. కార్యక్రమంలో జిల్లా నేతలు బి.మోహనరావు, సుధారాణి, కెనడీ, రామకృష్ణ, రవి, రమణ, లక్ష్మణ్, అప్పారావు పాల్గొన్నారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం

గొల్లగూడెం విద్యుత్ ఉప కేంద్రానికి వెళ్లే దారి వద్ద వరద నీరు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడులో శనివారం తెల్లవారుజాము నుండి వర్షం కురిసింది. దీంతో ప్రజలంతా ఇళ్లకే పరిమితమయ్యారు. ఫలితంగా పట్టణంలో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఈ వర్షం వల్ల నారుమళ్ళ, నాట్లు వేసిన పొలాలకు, మొక్కజొన్నకు మేలు కలుగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూజివీడులో శనివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 6.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

జంగారెడ్డిగూడెంటౌన్: పట్టణంలో శనివారం తెల్లవారుజాము నుంచి బలమైన ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో జన జీవనం స్తంభించింది. ఉదయాన్నే పనులకు వెళ్లే ప్రజలకు, విద్యార్థులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. పట్టణంలో పలు రోడ్లు జలమయమయ్యాయి. పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో వ్యాధులు ప్రబలమే ప్రమాదం ఉందని, తక్షణం మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

జీలుగుమిల్లి: మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. చెరువులు, వాగులు వంకల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. నారుమడుల్లోకి నీరు చేరడంతో రైతులు వరినాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండడంతో కామయ్యపాలెం వాగు, అశ్వారావుపేట వాగుల గుండా వరద నీరు పోటెత్తుతోంది. ఆయా మార్గాల్లో రోడ్లపైకి వరద నీరు ఉప్పొంగే ప్రమాదం ఉందని, ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ఉంగుటూరు: భారీ వర్షాలకు ఏలూరు ప్రధాన కాలువలో నీరు గట్టును తాకుతూ ప్రవహిస్తోంది. శుక్రవారం సాయంత్రం ఉంగుటూరు యుటి-4 వద్ద కాలువ గట్టు కొంతమేర కోతకు గురై నీరు బయటకు పొర్లిన సంగతి తెలిసిందే. ఇరిగేషన్ అధికారులు కోతకు గురైన గట్టుకు సంచుల్లో మట్టిని నింపి తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. గొల్లగూడెంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట వరద నీరు రోడ్డుపై నుంచి పొంగిపొర్లుతోంది. నారాయణపురం రైల్వే అండర్ పాస్ మార్గంలో చిన్నపాటి వర్షానికే నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ముదినేపల్లి: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం వరి చేలకు జీవం పోసింది. మండలంలో శుక్ర, శని వారాల్లో భారీ వర్షం కురవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షం నేరుగా విత్తనాలు వెదజల్లిన చేలకు జీవం పోసిందని రైతులు చెబుతున్నారు.

బుట్టాయగూడెం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండ వాగుల ద్వారా చేరుకున్న నీటితో వాగులన్నీ పొంగుతున్నాయి. దీంతో పలు మార్గాల్లో కాజ్‌వేలపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు స్వల్ప ఇబ్బందులు ఏర్పడ్డాయి. కెఆర్‌పురం ఐటిడిఎకు వెళ్లే మార్గంలో వాగు పొంగడంతో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. పలు కల్వర్టుల వద్ద పోలీసులు గస్తీ కాస్తున్నారు.

రోగులతో మాట్లాడుతున్న ఎంపీ మహేష్‌కుమార్

ఏలూరు సర్వజన ఆస్పత్రిలో ఎంపీ ఆకస్మిక తనిఖీ

రోగుల వార్డుల్లో అపరిశుభ్రతపై ఆగ్రహం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్థానిక జిల్లా కేంద్ర సర్వజన ఆసుపత్రిని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వార్డులు అపరిశుభ్రంగా ఉండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే ఆసుపత్రి అంతా శుభ్రంగా ఉండేలా చూడాలని ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. రోగులను పరామర్శించి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి అవసరమైన అన్నిరకాల వైద్యపరికరాల వివరాలు, అంచనా వ్యయం తన కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తత అవసరం : ఎపిఇపిడిసిఎల్

ఏలూరు అర్బన్ :రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా విద్యుత్ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ జిల్లా పర్యవేక్షక ఇంజినీరు సాల్మన్‌రాజు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ముమ్మరంగా వ్యవసాయ పనులు కొనసాగిస్తున్న రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా వర్షం పడేటప్పుడు పొలాల్లో ఉన్న విద్యుత్ మోటర్లు ఆన్ చేయవద్దని, విద్యుత్ స్తంభాలు పొలాల్లో ఒరిగి పడే పరిస్థితి ఉంటే తక్షణమే ఆయా మండలాల్లో పని చేస్తున్న విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. పొలాల్లో విద్యుత్తు మోటార్ల వైర్లు తెగి ఉంటే రైతులు వాటిని ముట్టుకోకుండా తగు జాగ్రత్తలు పాటించి ప్రమాదాలకు గురి కాకుండా ఉండాలని సూచించారు.

ఉచిత వైద్యం అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని, ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించడమే తన లక్ష్యమని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక నగర పంచాయతీలో శనివారం గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి పివిఆర్ హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో 2డి (ఎకో), ఇసిజి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులున్న వారికి పివిఆర్ హాస్పిటల్‌లో ఉచితంగా గుండె ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు. ప్రతి మంగళవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. మిషన్ హోప్ ద్వారా సేవలందించినప్పుడు ఇక్కడి ప్రజలకు ఆరోగ్యంపై సరైన అవగాహన లేదని గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో హాస్పటల్ సిబ్బంది, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవే 'ఆశ్రం' లక్ష్యం

నేటి నుంచి ఏడాదిపాటు రజతోత్సవ వేడుకలు

ఉచితంగా వంద శస్త్రచికిత్సలు, ప్రసవాలు

తక్కువ ధరకు కీళ్లమార్పిడి చికిత్స

250 మంది విద్యార్థులతో వైద్య కళాశాల

పోస్టుగ్రాడ్యుయేట్, సూపర్ స్పెషాలిటీ కోర్సులు అందుబాటులోకి

డైరెక్టర్లు రతిదేవి, డాక్టర్ పార్థసారధి

సమావేశంలో మాట్లాడుతున్న ఆశ్రం డైరెక్టర్ రతిదేవి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఆశ్రం' (అల్లూరి సీతారామరాజు వైద్యశాస్త్ర అకాడమీ) హాస్పిటల్ స్థాపించి 25 ఏళ్లయిన సందర్భంగా రజతోత్సవ వేడుకలు ఈ నెల 14 నుంచి నుంచి 2025 జులై వరకూ జరుగుతాయని ఆ హాస్పిటల్ డైరెక్టర్లు రతిదేవి, డాక్టర్ పార్థసారధి తెలిపారు. మరింత నాణ్యమైన వైద్య విద్యను అందించడం, పరిపూర్ణ ఆరోగ్య సంరక్షణ, సమాజానికి సేవ చేయడమే ఆశ్రం లక్ష్యంగా భవిష్యత్తులోనూ ముందుకు సాగనున్నట్లు వెల్లడించారు. శనివారం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆశ్రం వైద్యకళాశాల 1999లో స్థాపించినప్పటి నుంచి ప్రతిష్టాత్మకంగా ముందుకు సాగుతుందన్నారు. 2000వ సంవత్సరంలో ఎంబిబిఎస్ కోర్సు వంద మంది విద్యార్థులతో ప్రారంభించి నేడు 250 మందికి పెరిగిందన్నారు. 2007లో పోస్టు గ్రాడ్యుయేషన్ ఎమ్‌డి, ఎంఎస్ కోర్సులకు అనుమతి పొంది ప్రస్తుతం 158 పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు, రెండు సూపర్ స్పెషాలిటీ కోర్సులు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇక్కడ చదివిన ఎంతోమంది వైద్యులు ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నారని తెలిపారు. అంకితభావం కలిగిన అధ్యాపకుల సహకారంతో వైద్యరంగంలో నూతన ప్రమాణాలు తీసుకురాగలిగామని చెప్పారు. ఎపిలో ప్రయివేటు మెడికల్ కళాశాలల్లో జాతీయ వైద్య మిషన్ ద్వారా ప్రాంతీయ వైద్య విద్య, సాంకేతిక కేంద్రంగా గుర్తించబడిన ఏకైక వైద్యకళాశాల ఆశ్రం మాత్రమేనని వివరించారు. ఆశ్రంలో మెడికల్ కళాశాలతోపాటు నర్సింగ్, పారామెడికల్ విద్యాసంస్థలను సమాజసేవే లక్ష్యంగా నడుపుతున్నట్లు తెలిపారు. డాక్టర్ గోకరాజు గంగరాజు దార్శనికతే ఆశ్రం అభివృద్ధికి మూలమని చెప్పారు. ఛైర్మన్ గోకరాజు గంగరాజు పుట్టినరోజు, రజతోత్సవ వేడుకలను ఆదివారం జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత, మాజీ సొసైటీ డైరెక్టర్లు, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రముఖులతో ప్రారంభోత్సవ కార్యక్రమం, గోకరాజు గంగరాజు సత్కార కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

రజతోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఉచిత వైద్యసేవలు

రజతోత్సవాలను పురస్కరించుకుని ఏడాదిపాటు అనేక ఆరోగ్యసేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. వైద్యశాస్త్రంలో నూతన ఆవిష్కరణలపై జాతీయ, రాష్ట్రస్థాయి సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహిస్తామన్నారు. సమీప గ్రామ, పట్టణాల్లో పేదలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, వైద్యం అందించనున్నట్లు తెలిపారు. అవసరమైన పేదలకు వంద శస్త్రచికిత్సలు, ప్రసవాలు, డెలివరీ బేబీకి మామ్‌కిట్ అందిస్తామని వివరించారు. తక్కువ ధరకు నాణ్యమైన శస్త్రచికిత్స సేవలందించడం, రూ.90 వేలకు కీళ్లమార్పిడి చికిత్స అందించనున్నట్లు తెలిపారు. పూర్తిరాయితీతో డయాగ్నోస్టిక్ సేవలు కొనసాగుతాయన్నారు. పూర్వవిద్యార్థుల సమ్మేళనం, వైద్యరంగంలో విశేష కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవార్డులు ఇస్తామన్నారు. జర్నలిస్టులకు వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఆశ్రం రజతోత్సవ వేడుకలు భవిష్యత్తు ఆవిష్కరణలకు, సమాజసేవలకు మరింత మార్గం చూపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అంజిరెడ్డి, ప్రిన్సిపల్ సిహెచ్.శ్రీనివాసరావు, సిఇఒ హనుమంతరావు, సిఒఒ రాజన్ పాల్గొన్నారు.

తూతూమంత్రం.. తాత్కాలికం..!

ఓ పక్క నిత్యావసరాల ధరల మోత.. మరోపక్క వర్షాల కష్టనష్టాలు.. జిల్లా వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇక ఇసుక ధర కొత్త ప్రభుత్వ పాలనలోనూ వీడని కష్టంగానే మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గోదావరి వరద పోలవరం నిర్వాసితులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.

నిత్యావసరాల ధరల మోత మోగుతోంది. అదే సమయంలో మేమేమీ తక్కువ కాదంటూ కూరగాయల ధరలు భగభగమండుతున్నాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం తల్లడిల్లుతున్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు వర్తకులతో సమావేశాలు నిర్వహించి ధరల నియంత్రణకు సహకరించాలని విజ్ఞప్తులు చేశారు. ఆపై పట్టణాల్లోని రైతుబజార్లలో బియ్యం, కందిపప్పు సబ్సిడీ ధరకు విక్రయించేలా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఆర్భాటంగా ప్రారంభించారు. ఇంతవరకూ బాగానే ఉంది. మరి మిగిలిన నిత్యావసరాలు, కూరగాయల ధరల సంగతేంటో అధికారులు, పాలకులే చెప్పాలి. ఈ ప్రత్యేక కౌంటర్లు పట్టణాల్లోనే ఉండడంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు ధరల భారం నుంచి ఉపశమనం అందని ద్రాక్షగానే మిగిలింది. ఇప్పటికైనా ప్రభుత్వం రేషన్‌దుకాణాల ద్వారా బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార, నూనె వంటి నిత్యావసరాలు సబ్సిడీపై అందిస్తే కచ్చితంగా ప్రజలంతా ఎంతోకొంత ధరాభారం నుంచి ఉపశమనం పొందుతారు. అంతేగాని తూతూమంత్రంగా పట్టణాల్లోని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం తూతూమంత్రపు చర్యలేనని పరిశీలకులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు.

ఇక వర్షాలు డెల్టాలో, మెట్టలో సాగు పనులు ముమ్మరానికి దోహదం చేశాయి. అదే సమయంలో రోడ్లు అధ్వానం, మురుగు డ్రెయిన్లలో సిల్టు తీయకపోవడంతో కొద్దిపాటి వర్షానికే పరిస్థితి ఇబ్బందికరంగా తయారవుతోంది. ఇదే సమయంలో పారిశుధ్యం క్షీణించడంతో జనం బెంబేలెత్తుతున్నారు. గ్రామాల్లో జలుబు, జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ క్రమంలో అపారిశుధ్యం వల్ల డయేరియా వంటివి ప్రబలే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్య కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టాలని పంచాయతీలకు ఆదేశాలిచ్చి చేతులు దులుపుకోవడం తప్ప వాటికి నిధులిచ్చి ముందుకు నడిపే ప్రయత్నం పాలకుల వైపు నుంచి పెద్దగా ఉండడం లేదు. ఈ క్రమంలో గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టడంతోపాటు డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపర్చడం, పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచడం, డంపింగ్ యార్డుల సమస్య పరిష్కారానికి చర్యలు చేపడితే తాత్కాలిక ఉపశమనంతోపాటు భవిష్యత్తులో సమస్యలకు ఒకింత శాశ్వత పరిష్కారం లభిస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇక గోదావరి వరద పోలవరం నిర్వాసితులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలు ఎలా గడుస్తాయా అని అక్కడి ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు నిత్యావసర సరుకులు జిల్లా అధికారులు తరలించి నిల్వ పెట్టారు. ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి ఆ రెండు మండలాల్లో పర్యటించి గోదావరి వరదొచ్చినా ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంతవరకూ బాగానే ఉంది. అయితే ఈ సమస్య నుంచి తమకు శాశ్వత విముక్తి ఎప్పుడని పోలవరం నిర్వాసితులంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. తమకు పరిహారం, ప్యాకేజీ ఇచ్చి పునరావాసం కల్పిస్తే ముంపు గ్రామాల్లో ఎందుకు ఉంటామని ప్రశ్నిస్తున్నారు. ఆ దిశగా చంద్రబాబు ప్రభుత్వం ఏ మేరకు చర్యలు తీసుకుంటుందో వేచిచూడాలి.

ఇక ఇసుక సమస్య జిల్లా వాసులను వీడడం లేదు. తవ్వకం, ఎగుమతి ఛార్జీలతోపాటు రవాణా ఛార్జీలు నిర్మాణదారులకు భారంగా మారాయనేది స్పష్టం. వాటిని తగ్గించేలా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మండల కేంద్రాల్లో ఇసుక డంప్‌లు ఏర్పాటు చేసి వినియోగదారులకు అందిస్తే వినియోగదారులకు కొంతభారం తగ్గే అవకాశం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. ఇక పశ్చిమగోదావరి జిల్లాలో ఇసుక డంప్ యార్డుల్లో మినహా ర్యాంపుల్లో ఇసుక అందుబాటులో లేకపోవడం అక్కడి వినియోగదారులకు ఇబ్బందిగా మారింది. త్వరలోనే పాలకులు ఈ సమస్యలను పరిష్కరిస్తే జనానికి ఇసుక కష్టాలు, భారం నుంచి విముక్తి లభించే అవకాశం ఉంది.

- వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

నాన్ బెయిలబుల్ వారెంట్లు అమలు చేయాలి

ఏలూరు అర్బన్ :ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగులో ఉన్నాయని, వాటిని అమలు చేయడం ద్వారా కేసులను త్వరగా పరి ష్కరించడానికి అవకాశం ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఐ.శ్రీని వాసమూ ర్తి తెలిపారు. శనివారం జిల్లా న్యాయ సేవాధి.కార సంస్థ భవనంలో నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆయా జిల్లాల ఎస్‌పిలతో సమన్వయ సమావేశం నిర్వహించారన్నారు. పెండింగు లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్ల పరిష్కా రానికి చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. సాక్షు లుగా ఉన్న ప్రభుత్వ అధికారులు పని చేసే స్థానాలను గుర్తిం చి సమన్లు అమలు చేయడం ద్వారా కేసుల పరి ష్కారాన్ని ముందుకు తీసుకెళ్లాలని చెప్పార న్నారు. ఖైదీ లను ఆన్‌లైన్ ద్వారా కోర్టు ఎదుట ప్రవేశపెట్టడం, సమన్లను ఎన్-స్టెప్ ద్వారా అమలు చేయడం వల్ల త్వరితగతిన కేసులను పరిష్కరించవచ్చని సూచించారని తెలిపారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఎంఎల్‌ఎలకు భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని 12, 14 మెమోలను రద్దు చేయాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటికి, దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌కు వారి వారి కార్యాలయాల్లో శనివారం వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వై.రాంబాబు, సిఐటియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గతంలో అనేకసార్లు రోడ్డెక్కినప్పటికీ వైసిపి ప్రభుత్వం పరిష్కరించ లేదన్నారు. ఆ సందర్భంగా టిడిపి, జనసేన పార్టీలు తమ ప్రభుత్వం అధికారంలోకొస్తే భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇరువురు ఎంఎల్‌ఎలు ఈ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు 'హీల్' విద్యార్థులు

పోటీలకు ఎంపికైన విద్యార్థులతో సత్యప్రసాద్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ జూనియర్, సబ్ జూనియర్ ఛాంపియన్ పోటీల్లో మండల పరిధిలోని తోట పల్లి హీల్ పాఠశాల విద్యార్థులు బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించారు. విశాఖ పట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్–2024 పోటీల్లో హీల్ అంధ పాఠశాల విద్యార్థులు ఐదు బంగారు, రెండు రజత, ఐదు కాంస్య పతకాలను సాధించారు. అంతేకాకుండా ఈ నెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు బెంగుళూరులో నిర్వహించనున్న జాతీయ పారా అథ్లెటిక్స్ పోటీలకు జె.వరలక్ష్మి, సిహెచ్.ప్రవీణ్, కె.సునీల్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, సిఇఒ కూరపాటి అజయ్‌కుమార్, ప్రిన్సిపల్ బి.సాయిబాబు, అంధ పాఠశాల ఇన్‌స్ట్రక్టర్ రష్మంత్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నాగరాజు, ప్రభృతులు అభినందించారు.

అజయ్‌రాజుకు విఐటిలో సీటు

అజయ్‌రాజుకు లెటర్ ఇస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థి హనుమంతు అజయ్‌రాజుకు విఐటి అమరావతి యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో ఉచిత సీటు వచ్చిందని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బివి.శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 985 మార్కులతో రాష్ట్ర స్థాయిలో సెకండ్ ర్యాంకు పొందిన అజయ్‌రాజుకు అమరావతి విఐటి విశ్వవిద్యాలయం సీటు రావడం పట్ల ఏలూరు జిల్లా వృత్తి విద్యాధికారి బి.ప్రభాకరరావు అభినందించారు. ఉంగుటూరు మండలం కైకరం గ్రామం రైతు కుటుంబానికి చెందిన అజయ్‌రాజు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో స్పెషలైజేషన్ చేయనున్నారు.

విభిన్న ప్రతిభావంతుడికి వీల్‌చైర్ అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

స్థానిక అగాపే కార్యాలయంలో శనివారం నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సేవా కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన విభిన్న ప్రతిభావంతునికి వీల్‌చైర్ అందించారు. జంగారెడ్డిగూడెం పట్టణ సూరపరాజు కాలనీకి చెందిన ఆశిబాబు అగాపే స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి విభిన్న ప్రతిభావంతుల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం ఆశిబాబు వ్యక్తిగత వితరణతో తాడేపల్లిగూడేనికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు బత్తిన శ్రీనుకు రూ.20 వేల విలువైన వీల్‌చైర్‌ను అందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి మాబూ సుభాని మాట్లాడుతూ అగాపే సంస్థ ద్వారా విభిన్న ప్రతిభావంతులకు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ సేవలు వారిలో ధైర్యాన్ని, భరోసాను నింపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు లక్ష్మణరావు, కార్యదర్శి బాజీ పఠాన్, కొప్పాక రాజు, శ్రీను పాల్గొన్నారు.

జిపిఎస్ నోటిఫికేషన్ రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

గ్యారెంటీ పెన్షన్ స్కీం(జిపిఎస్) గెజిట్ నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ ఆగిరిపల్లి మండల ప్రధాన కార్యదర్శి కలపాల అజరయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఒపిఎస్‌కు బదులుగా గత ప్రభుత్వం తెచ్చిన జిపిఎస్ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకించడంతో పాటు దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశామన్నారు. అయినప్పటికీ గత ప్రభుత్వం అనుసరించిన విధానాలకు అనుగుణంగా జిపిఎస్ అమలుకు ఇప్పుడు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడమే కాకుండా గతేడాది అక్టోబర్ 20 నుంచి అమలు చేయనున్నట్లు పేర్కొనడంపై ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల సానుకూలంగా స్పందించి సదరు గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయటంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం జిఒ నెంబర్ 54ను రద్దు చేయాలని ఆయన కోరారు.

ఏలూరు అర్బన్ :జిపిఎస్ అమలు పరుస్తూ శుక్రవారం ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయడానికి ఈ నెల 16న జరిగే క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగులు కాదన్నప్పటికీ గత ప్రభుత్వం మొండిగా తీసుకొచ్చిన జిపిఎస్ రద్దు చేయాలని కోరారు. అధికారంలోకొచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పిన జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ రాష్ట్రంలో ఉన్న ఉద్యోగులందరూ కూటమి ప్రభుత్వ రావడానికి ఎంతో కృషి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం జిపిఎస్ జిఒ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

చాట్రాయి : పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని అధికారంలోకొచ్చిన అప్పటి ప్రభుత్వం మోసపూరితంగా జిపిఎస్ చట్టం చేసిందని యుటిఎఫ్ చాట్రాయి మండల కార్యదర్శి వెంకట్రావు అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చర్చించి పాత పెన్షన్ విధానం మాత్రమే కొనసాగించాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడులో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నూజివీడు ఎలక్ట్రికల్ ఎఇ వి.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు కొన్ని సూచనలు చేశారు. ఇంటి గోడలు తడిగా మారితే స్విచ్ బోర్డు నుంచి విద్యుత్ గోడలకు విస్తరించొచ్చని, ఎర్తింగ్ వేయకపోతే షాక్ తగులుతుందని చెప్పారు. తడిచేతులతో విద్యుత్ తీగలను, ఉపకరణాలను తాకకూడదన్నారు. విద్యుత్ స్తంభం సపోర్టింగ్ వైర్‌లోకి ఒకసారిగా విద్యుత్ ప్రవాహం జరగొచ్చని, వాటికి దూరంగా ఉండాలని, వర్షాకాలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిల్చొవద్దని సూచించారు. వ్యవసాయ బావులు, బోర్ల వద్ద మోటార్లను ఆన్ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడిచిన స్టార్టర్ బాక్సులను, ఫీజు బాక్సులను ముట్టుకోవద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

20 వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట శివారు ఆడమిల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ, బికాం, బిఎస్‌సి కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయబాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీలోగా విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కొత్త షెడ్యూల్ ప్రకారం 23వ తేదీ నుంచి 26 వరకు ఆప్షన్ల ఎంపికకు, 27న ఎంపిక చేసుకున్న ఆప్షన్లలో మార్పులు చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. 31వ తేదీన సీట్లు కేటాయింపు, ఆగష్టు ఒకటో తేదీన విద్యార్థులు కళాశాలలో రిపోర్ట్ చేయాలని, అదే రోజునుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మహిళా విద్యార్థులకు ఉచితంగా హాస్టల్ సదుపాయం కల్పించనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

నేరాలు - ఘోరాలు

తప్పిన పెను ప్రమాదం

లారీ క్యాబిన్ నుంచి బయటకు దూసుకెళ్లిన పైపు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున పెను ప్రమాదం తప్పింది. విశాఖపట్నం నుంచి హైదరాబాద్ పైపులతో వెళ్తున్న ట్రాలి లారీ సెంటర్‌లో జాతీయ రహదారిపై ఉన్న గోతిని తప్పించబోయి డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ట్రాలిలో వెనకాల ఉన్న పైపు కాస్త లారీ క్యాబిన్ గుండా డ్రైవర్ పక్క నుంచి బయటకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కాస్త పక్కకు ఉండటంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. అనంతరం జెసిబి సహాయంతో పైపును వెనక్కి నెట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రజోపయోగ కార్యక్రమాలకు చేయూతనందించాలి

కక్షసాధింపు చర్యలు సరికావు

శాంతివనం శ్మశానవాటికను పరిశీలించిన ఎంఎల్‌ఎ బడేటి చంటి

మొక్కలు నాటుతున్న ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వ్యక్తిగత రాగద్వేషాలకు అతీతంగా ప్రజోపయోగ కార్యక్రమాలకు చేయూతనందించాల్సిన ప్రజాప్రతినిధులు కేవలం కక్షసాధింపు చర్యగా ప్రజలకు ఉపయోగపడే వాటిని విధ్వంసం చేయడం ప్రజాగ్రహానికి గురి చేస్తుందన్న వాస్తవాన్ని గుర్తించాలని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న ఉన్నత ఆశయంతో ముందుకొచ్చే స్వచ్ఛంద సంస్థలకు చేయూత అందించాలే కాని వారిని ఇబ్బందుల పాలు చేసి తద్వారా ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తే చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. ఏలూరు అశోక్ నగర్ బ్రిడ్జి వద్ద ఉన్న శాంతివనం శ్మశాన వాటికను శనివారం ఆయన పరిశీలించారు. ఈ శాంతివనంలో ప్రజలకు ఉపయోగపడే రీతిలో ప్లాష్ స్వచ్ఛంద సంస్థ ఎన్నో కార్యక్రమాలను నిర్వహించింది. అయితే గత ప్రభుత్వ హయాంలో ప్లాష్ స్వచ్ఛంద సంస్థపై కన్నెర్రజేసిన మాజీ ప్రజాప్రతినిధి ప్రజలకు ఉపయోగపడే కట్టడాలను కార్పొరేషన్ అధికారులతో కూల్చివేయించారు. అప్పటినుంచి ఈ వ్యవహారం కోర్టులో నడుస్తోంది. కాగా శనివారం శ్మశానవాటికను పరిశీలించిన ఎంఎల్‌ఎ బడేటి చంటి పూర్తి వివరాలను ప్లాష్ టీంను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆవరణలో మొక్కలు నాటి ట్రీ గార్డ్ ఏర్పాటుచేశారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ దాదాపు వందేళ్ల చరిత్ర ఉన్న శ్మశానవాటికలో 20 ఏళ్ల క్రితం ప్లాష్ స్వచ్ఛంద సంస్థ ఎన్నో కార్యక్రమాలు చేపట్టి, ప్రజలకు ఉపయుక్తంగా ఉండేలా తీర్చిదిద్దిందని చెప్పారు. ప్లాష్ వ్యవస్థాపకులు, ఆ సంస్థ నిర్వాహకులు యర్రంశెట్టి శ్రీనివాస్ దాతల సహకారంతో ఈ శ్మశానవాటికను అందరికీ ఉపయోగంగా ఉండేలా తీర్చిదిద్దారన్నారు. శ్మశానవాటిక ఆవరణలో శవ పేటికలు, వాహనాలు అందుబాటులో ఉంచి, ఎవరు ఫోన్ చేసినా వారికి పంపేవిధంగా చర్యలు తీసుకున్నారన్నారు. అయితే 2022 నవంబరులో జరిగిన ఓ కార్యక్రమానికి మాజీ ప్రజాప్రతినిధి హాజరయ్యారని, ఆ సమయంలో తనకు అవమానం జరిగిందని మనసులో పెట్టుకున్న ఆయన కక్షసాధింపు చర్యగా కార్పొరేషన్ అధికారులను పంపి, శ్మశానవాటిక ఆవరణలో ఉన్న షెడ్డును కూల్చివేయడంతో పాటు శవపేటికలు, వాహనాలకు నష్టం చేకూర్చారన్నారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు చేయూతనందించాలే తప్పా ఈ విధంగా తన స్వార్థ ప్రయోజనం కోసం సంస్థల నష్టపరచాలని ప్రజలకు ఇబ్బందులు సృష్టించడం భావ్యం కాదన్న విషయం మాజీ ప్రజాప్రతినిధి విస్మరించడం బాధాకరమన్నారు. శాంతివనాన్ని పూర్వస్థితిలో అభివృద్ధి పరిచి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఇప్పటికే ఈ విధ్వంసం విషయం సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి వెళ్లిందని, వారు కూడా విస్మయం వ్యక్తం చేశారని చెప్పారు. శాంతివనం పునరుద్ధరణకు వారు కూడా పూర్తి సహకారం అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకట రత్నం, ఎఎంసి మాజీ ఛైర్మన్ పూజారి నిరంజన్, ఆర్ఎంఆర్.నాగేశ్వరరావు, ప్రసాద్, పాండురంగారావు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు లేకుండా చూడాలి

అధికారులకు ఎంపీ మహేష్‌కుమార్ ఆదేశాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లాలో విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ ఉండేలా చూడాలని ఎంపీ మహేష్‌కుమార్ విద్యుత్ శాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు పార్లమెంట్ టిడిపి కార్యాలయంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విద్యుత్ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతి సమీపంలో ఏలూరు కేంద్రంగా పరిశ్రమల జోన్ వస్తుందని,దానికి కావాల్సిన విద్యుత్ ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని అధికారులకు సూచించారు. ఇతర సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎలక్ట్రికల్ ఎస్ఇ సాల్మన్‌రాజు, ఇఇ రాధాకృష్ణ, డిఇ నటరాజన్, పలువురు డివిజనల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

రూ.10.15 కోట్లతో వాటర్ ట్యాంకుల నిర్మాణం

నేడు ఏలూరు ఎంపీచే శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉంగుటూరు

జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఉంగుటూరు మండలంలోని 14 గ్రామాల్లో పైపుమార్గం, ఒహెచ్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణానికి రూ.10.15 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 14 గ్రామాల్లో పనులకు ఒక్క కాంట్రాక్టరే టెండరులో పనులను దక్కించుకున్నారు. దీంతో పెద వెల్లమిల్లిలో ఈ నెల 14న పనులకు శంకుస్థాపన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పాల్గొని అభివృద్ధి పనులు ప్రారంభిస్తారు. గొల్లగూడెం, గుళ్లపాడు, కైకరం, నాచుగుంట, రావులపర్రు, వెల్లమిల్లి, గోపాలపురం, పందిరెడ్డిగూడెం, కంసాలిగుంట, యర్రమిల్లిపాడు, తల్లాపురం, చింతాయగూడెం, కొత్తగూడెం, వీకేపురం గ్రామాల్లో కొత్తగా మంచి నీటి ట్యాంకులు, బోర్లు, పైపు మార్గం నిర్మాణ పనులు చేయాల్సి ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ హరినాథరాజు తెలిపారు.

విద్యార్థులకు హిందీ పద్య పఠన పోటీలు

ఏలూరు అర్బన్ :స్థానిక పవర్‌పేటలోని హిందీ నికేతన్‌లో హిందీ నికేతన్ వజ్రోత్సవాల్లో భాగంగా శనివారం హిందీ పద్య పఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ నికేతన్ అధ్యక్షులు వి.వెంకటస్వామి మాట్లాడుతూ నేడు పిల్లలకు పద్యం ప్రాముఖ్యత తెలియడం లేదని, పద్యం అవసరాన్ని, ప్రాముఖ్యతను తెలియజేయడానికి హిందీ పద్య పఠన పోటీలు నిర్వహించామని చెప్పారు. పిల్లలకు నైతిక జీవన సూత్రాలు తెలపడానికి, ధారణ శక్తి వృద్ధికి, భాషా సౌందర్యం తెలుసుకోవడానికి, ఆత్మవిశ్వాసం కోల్పోతున్న అనేక సందర్భాల్లో ఆత్మవిశ్వాస బీజాల్ని నాటి వాటిని మహావృక్షాలుగా పెంచేవి పద్యాలని, ప్రతి విద్యార్థి పద్య పఠనం నిరంతరం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన హిందీ పండిట్ ట్రైనింగ్ కళాశాల లెక్చరర్ పిఎం మోహన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పద్య పఠనం వల్ల వ్యక్తిత్వ వికాసం, ఆత్మ చైతన్యం, సాహితీ విలువలతో కూడిన జీవితం అలవడుతుందన్నారు. కార్యదర్శి కవితాకుమారి మాట్లాడుతూ హిందీ నికేతన్ వజ్రోత్సవాల సందర్భంగా సంవత్సరమంతా విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తామని, విద్యార్థులు జాతీయ భాష హిందీ పట్ల ఆసక్తి చూపించి భాషను అభ్యసిస్తే భారతదేశంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా భాషా సమస్యలు ఉండవన్నారు. ఈ పోటీల్లో మొత్తం 66 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులను వరుసగా ఎస్.ప్రతిమ, ఎస్.నందకిషోర్, సిహెచ్.రేవంత్ పొందగా ఎస్.శ్రీసౌమ్య, ఆర్.ధనరాజ్ ప్రోత్సాహక బహుమతులు పొందారు.

వసతి గృహంలో ఎంఎల్ఎ బలరాజు తనిఖీలు

జీలుగుమిల్లి : బర్రింకలపాడు గిరిజన సంక్షేమ గురుకుల వసతి గృహాన్ని ఎంఎల్ఎ చిర్రి బాలరాజు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను, సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. అనం తరం వసతి గృహ పరిసరాలను, విద్యార్థులకు వండే వంటకాలను పరిశీ లించారు. వారికి పెట్టే మెనూను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల పట్ల బాధ్యతగా ఉండాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు పోషకాహారం అందించాలని ఆదేశిం చారు.

మాతృభాష విద్యావాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం రూరల్

మాతృభాషా విద్యలో విద్యాబోధన చేస్తూ విద్యార్థులకు దగ్గరవుతున్న ఉపాధ్యాయుల పట్ల ఐటిడిఎ అధికారుల తీరు బాధాకరమని గిరిజన సంఘం నాయకులు తెల్లం రామకృష్ణ, మాతృభాష విద్య వాలంటీరు కుంజం నవీన్ అన్నారు. గిరిజన సంక్షేమమే ధ్యేయంగా పని చేయాల్సిన ఐటిడిఎ అధికారులు గిరిజన మాతృభాష పట్ల హేళన చేసే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాతృభాషా విద్యా వాలంటీర్లను విధుల్లో తీసుకుంటుంటే ఏలూరు జిల్లాలో ఉన్న ఐటిడిఎ కోట రామచంద్రపురం మాతృభాష విద్యా వాలంటీర్లను తీసుకోబోమని చెప్పడం సరికాదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రాథమిక విద్యలో మాతృభాష పాఠాలు చెప్పే ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎఎంసి ఛైర్మన్‌గా అవకాశమివ్వాలని వినతి

ప్రజాశక్తి - కామవరపుకోట

చింతలపూడి ఎఎంసి ఛైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును కలిసి టిడిపి మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ వినతిపత్రం అందించారు. గత ఐదేళ్లుగా తెలుగుదేశం పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ పార్టీ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవటానికి, ప్రజల్లోకి తీసుకెళ్లటానికి నియోజకవర్గ సీనియర్ నాయకుల సూచనల మేరకు శాయి శక్తులా కృషి చేశానని కిలారు తెలిపారు. చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ బాధ్యతలు నిర్వర్తించే అవకాశం కల్పించాలని పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఆయనతో పాటు బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు జుజ్జురి బాబ్జి, కామవరపుకోట గ్రామ కమిటీ అధ్యక్షుడు వజీర్ ఖాన్, యూనిట్ ఇన్‌ఛార్జి గోపీ ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి అప్పలరాజుగూడెం విద్యార్థులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివిన తొమ్మిది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఉత్తమ విద్యను అభ్యసించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించ వచ్చని ఉన్నత స్థాయికి ఎదగొచ్చని నిరూపించారు. కష్టపడి చదివి 550కి పైగా మార్కులు సాధించి ఏకంగా తొమ్మిది మంది ట్రిపుల్ ఐటీలో సీట్లు సొంతం చేసుకున్నట్లు ప్రిన్సిపల్ డిఎస్‌బి.శంకరరావు తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీకి నలుగురు విద్యార్థులు టి.జగన్నాథం, పి.ఆదర్శ్, ఇ.ప్రసన్న కుమార్, ఎం.అజయ్, ఒంగోలు ట్రిపుల్ ఐటీకి నలుగురు విద్యార్థులు పి.రామ్‌చరణ్, పిఎస్ఎ.భార్గవ్, పి.వివేక్‌కళ్యాణ్, జి.తరుణ్, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఒక విద్యార్థి కె.నంద కిషోర్ ఎంపికైనట్లు తెలిపారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందనడానికి నిదర్శనం అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల అని తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం ద్వారా ఇలాంటి ఫలితాలు సాధించగలిగామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు అందిన అవకాశాన్ని వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఎంపికైన విద్యార్థు లను మండల విద్యాశాఖాధికారులు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యా ణి, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ముదినేపల్లి :నూజివీడు ట్రిపుల్ ఐటీలో ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్‌కి చెందిన ఇద్దరు విద్యార్థులు కరీమున్నీసా, హేమా రేవంత్ సీటు సాధించినట్లు స్కూల్ ప్రధానోపాధ్యాయులు విజయకుమార్ తెలిపారు. వడాలి జెడ్‌పి హైస్కూల్‌కి చెందిన ఇద్దరు విద్యార్థులతో కలిపి మొత్తం మండలం నుంచి నలుగురు విద్యార్థులు నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు సాధించారు.

పోల్‌రాజ్ కాలువకు తాగునీరు విడుదల

ముదినేపల్లి :మండలంలోని ప్రధాన పంటకాల్వలో ఒకటైన పోల్‌రాజ్ పంట కాలువకు జల వనరుల శాఖాధికారులు తాగునీటిని విడుదల చేశారు. శుక్రవారం ఉదయం గుడ్లవల్లేరు లాకుల వద్ద నీటిని విడుదల చేయగా సాయంత్రానికి మండలంలోకి నీరు ప్రవేశించింది. 340 క్యూసెక్కుల నీటిని పోల్‌రాజ్ కాలువకు విడుదల చేశారు. నియోజవర్గంలో దాదాపు అన్ని గ్రామాల్లో మంచినీటి చెరువులు అడుగంటడంతో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. దీంతో జల వనరుల శాఖాధికారులు మొదట ప్రాధాన్యతగా మంచినీటి చెరువులు నింపుకునేందుకు తాగునీటిని విడుదల చేశారు. కాలువల ద్వారా తాగునీరు విడుదల చేయడంతో పంచాయతీ కార్యదర్శులు మంచినీటి చెరువులను నింపుకునేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

చింతలపూడి :ఆసుపత్రి సిబ్బంది రోగులకు మెరుగైన సేవలందించాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సలహా సంఘం కమిటీ సభ్యులను ఆయన శనివారం ప్రకటించారు. కొండ్రు దేవ, గుమ్మిశెట్టి భారతిలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

CHANGE OF NAME

I, **GANNABATHULA RAJA** S/o. Gannabathula Dharmarao resident of D.No. 17-1-19/A, Gogulamma Temple Street, Ward-28, Rustumbada, Narasapuram, W.G.Dt. A.P. I have changed my name from **GANNABATHULA RAJU** (Old name) to **GANNABATHULA RAJA** (New name) hence forth I am being called **GANNABATHULA RAJA** S/o. Gannabathula Dharmarao for all purposes.

దస్తావేజులు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, మార్టేరు గ్రామ కాపురస్తులు మల్లిడి సత్యనారాయణ రెడ్డి గారి కుమారుడు వెంకటరెడ్డి అను నేను నా మేనమామ గారైన తూర్పు గోదావరి జిల్లా, పెదపూడి మండలం, గొల్లలమామిడాడ గ్రామ కాపురస్తులు లేటు సత్తి రామారెడ్డి గారి కుమారుడు గోపాల్ రెడ్డి గారికి చెందిన ఒరిజినల్ ఇంటి దస్తావేజులు నెం. 1554/1996 ను జిరాక్స్ తీయించుటకు మార్టేరులో మా ఇంటి వద్ద నుండి మోటార్ సైకిల్‌పై జిరాక్స్ షాపునకు వెళుతుండగా దారి మధ్యలో ఎక్కడో పడిపోయినవి.

అడ్రస్: మల్లిడి వెంకటరెడ్డి
తండ్రి: సత్యనారాయణరెడ్డి
డో.నెం. 3-139/2, పుంత రోడ్
మార్టేరు, సెల్: 9032831585

మహారాజశ్రీ కాకినాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No.1684/2022 in A.S.No.137/2016
Between:
శ్రీ కోరంగేశ్వరస్వామి టెంపుల్, కోరంగి గ్రామం, Rep. by its Executive Officer ...అప్పిలెంట్/పిటిషనర్
మరియు
చంద్రాల గణేశ్వరరావు (died) & వగైరాలు ...రెస్పాండెంట్స్/రెస్పాండెంట్స్
To: రెస్పాండెంట్స్:
R2: శ్రీమతి చంద్రాల శేషారత్నం, W/o. గణేశ్వరరావు, C/o. చిలకా వెంకటేశ్వరరావు, చిన్నయ్యగూడెం, పశ్చిమగోదావరి జిల్లా.
R3: శ్రీమతి యార్లగడ్డ సూర్యకుమారి, W/o. శ్యామ్‌కుమార్, సిద్ధార్థ నగర్, విజయనగరం బస్‌స్టాండ్ దగ్గర, మెయిన్‌రోడ్, విజయనగరం–531202, (A.P.)
R4: శ్రీమతి కోరంగి అరుణ, W/o. సతీష్, M.G. రోడ్, చంద్రమౌళిపురం, శ్రీరామ్ నగర్, బెంజ్ సర్కిల్, విజయవాడ - 520 010
పై నెంబరు అప్పీల్‌లో 1వ రెస్పాండెంట్ చంద్రాల గణేశ్వరరావు గారు చనిపోయినందున వారి వారసులైన మిమ్ములను చేర్పించమని కోరుచూ దాఖలుచేసిన పిటిషన్‌పై మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది.22-07-2024 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు పై శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షమందు విచారించి తీర్మానించడమగును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
మిత్తిపాటి వెంకట విశ్వేశ్వర సుబ్రహ్మణ్యం
అడ్వకేట్, డో.నెం.2-46-7
విళ్ళవారి వీధి, వెంకట్‌నగర్
కాకినాడ 13-07-2024 కాకినాడ - 533 003

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2nd Additional Junior Civil Jodge (Junior Divison) వారి కోర్టులో, తాడేపల్లిగూడెం
E.P. No. 9/2024 in O.S. No. 57/2020
బిట్వీన్:
రెడ్డి సత్యనారాయణ ...DHR/ Plaintiff
అండ్
మద్దుకూరి నాగేశ్వరరావు ...JDR/ Defendant
శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఆస్తివేలం ప్రకటన
పై నెంబరు డిక్రీ బాకీ గాను ప్రతివాది/J.D.R తాలుకా ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్థి ది. 05-08-2024 వ తేదిన ఉదయం గం. 10:30 ని॥లకు లగాయతు పై కోర్టులో వేలం వేయబడును. షరుతులు తెలుసుకొని పాడుకొనవలెను.
షెడ్యూల్: పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, జగన్నాధపురం గ్రామం తాలుకా వ్యవసాయ భూమి bearing R.S. No. 115 to an extent of Ac. 0-60 Cents of Agriculture land bounded by:
EAST: Talla Venkateswarao`s Land
SOUTH: Maddhukuri Ramarao`s Land
WEST: Land of Siddhina Sirisha
NORTH: Siddhina Venkataswararao`s Land & etc. Land
పై హద్దుల మధ్య Ac. 0-60 cents గల వ్యవసాయభూమి సమస్త ఈజుమెంటు హక్కులతో సహా.
వాది/D.H.R వాల్యూ/కిమ్మత్తు: రూ. 10,00,000/–లు
అమీనా వాల్యూ/కిమ్మత్తు రూ. 20,00,000/–లు
MUTYALA SUNIL KUMAR
Advocate for D.H.R
Tadepalligudem

పదవ తరగతి ఒరిజినల్ మార్క్స్ మెమో పడిపోయినది

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం పెదమల్లం పంచాయతీ పరిధి పెదమల్లం లంక గ్రామానికి చెందిన బీర చిన్న మాచిరాజు S/o.బీర కృష్ణ కు చెందిన పదవ తరగతి ఒరిజినల్ మార్క్స్ మెమో పడిపోయినది. జెడ్‌పిపి హై స్కూల్ మామిడికుదురు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లో 2015 సంవత్సరం సంబంధించి రూల్ నెంబర్ 1509127139, రెగ్యులర్ pc/09/08256/0106815/2. కలిగిన ఎస్ ఎస్ సి ఒరిజినల్ మార్క్ లిస్టు కవర్లో పెట్టుకుని మోటార్ సైకిల్‌కి తగిలించుకొని తేదీ 26-06-2024న పెదమల్లం లంక నుంచి మోటార్ సైకిల్ పై జిరాక్స్ నిమిత్తం ఆచంట వస్తుండగా మార్గ మధ్యలో ఎస్ ఎస్ సి ఒరిజినల్ మార్క్ లిస్ట్ పడిపోయినది. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్ కు సంప్రదించగలరు.

అడ్రస్ : బీర చిన్న మాచిరాజు, S/o.బీర కృష్ణ, డోర్‌నెం.3-33, పెదమల్లం లంక ఆచంట మండలం పశ్చిమగోదావరి జిల్లా. పిన్ కోడ్ : 534269. సెల్.7893581953.

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 118/2019
బిట్వీన్:
విజయా బ్యాంక్ ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా నరసాపురం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, నరసాపురం –వాది
అండ్
పాలపర్తి రాజ్‌కుమార్ అండ్ అనదర్ –ప్రతివాది/ప్రతివాదులు
సమన్స్ టు:
D-2: రావి లీలాకృష్ణ, S/o. కృష్ణమూర్తి, డోర్ నెం. 2-31 (3), ఉత్తరపాలెం వల్లూరు, ఆచంట మండలం, ప॥గో॥జిల్లా - 534269.
మీరు వాది విజయా బ్యాంక్ (ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా), నరసాపురం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, ది. 19-07-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.
మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది:19-07-2024 ఫోన్: 08814-274628

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 70/2020
బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం –వాది
అండ్
వేముల లక్ష్మణ అండ్ అనదర్ –ప్రతివాది/ప్రతివాదులు
సమన్స్ టు:
D-1: వేముల లక్ష్మణ, S/o. మోహనరావు, డోర్ నెం. 4-115, 4వ బ్లాక్, గగ్గిపర్రు, అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా - 534268.
D-2: వేముల సావిత్రి, W/o. లక్ష్మణ, డోర్ నెం. 4-115, 4వ బ్లాక్, గగ్గిపర్రు, అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా - 534268.
మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, ది. 19-07-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.
మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది:19-07-2024 ఫోన్: 08814-274628

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 114/2020
బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం –వాది
అండ్
వేముల సుబ్బలక్ష్మి అండ్ అనదర్ –ప్రతివాది/ప్రతివాదులు
సమన్స్ టు:
D-1: వేముల సుబ్బలక్ష్మి, W/o. చిరంజీవి, డోర్ నెం. 4-105, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా - 534268.
D-2: వేముల చిరంజీవి డోర్ నెం. 4-105, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా - 534268.
మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, ది. 19-07-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.
మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది:19-07-2024 ఫోన్: 08814-274628

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 115/2020
బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం –వాది
అండ్
వేముల ఎర్రయ్య అండ్ అనదర్ –ప్రతివాది/ప్రతివాదులు
సమన్స్ టు:
D-1: వేముల ఎర్రయ్య, S/o. సూరన్న, డోర్ నెం. 4-125, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా - 534268.
D-2: వేముల కేదారేశ్వరి, W/o. ఎర్రయ్య, డోర్ నెం. 4-125, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా - 534268.
మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, ది. 19-07-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.
మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది:19-07-2024 ఫోన్: 08814-274628

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 116/2020
బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం –వాది
అండ్
వేముల దుర్గా మల్లేశ్వరి అండ్ అనదర్ –ప్రతివాది/ప్రతివాదులు
సమన్స్ టు:
D-1: వేముల దుర్గా మల్లేశ్వరి, W/o. చంద్రశేఖర్, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా - 534268.
D-2: వేముల కేదారేశ్వరి, W/o. ఎర్రయ్య, డోర్ నెం. 4-125, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా - 534268.
మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, ది. 19-07-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.
మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది:19-07-2024 ఫోన్: 08814-274628